# Eenadu

# సర్కారు నౌకరీలకు ఊర్ల నుంచే ఉరకెక్కువ!

**● గ్రూప్‌-2కు దరఖాస్తుల్లో గ్రామీణం నుంచే అధికం**

**ఈనాడు, హైదరాబాద్‌:** ప్రభుత్వ ఉద్యోగాలపై పట్టణ ప్రాంత ప్రజల కన్నా పల్లెల్లోనే ఆసక్తి ఎక్కువా? తెలంగాణ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ నిర్వహించబోతున్న తొలి గ్రూప్‌-2 పరీక్షకు వచ్చిన దరఖాస్తుల తీరు చూస్తుంటే అలాగే అనిపిస్తుంది. శిక్షణ సంస్థలు ఎక్కువగా ఉన్న హైదరాబాద్‌, రంగారెడ్డి జిల్లాల కంటే దూరంగా ఉన్న జిల్లాల నుంచే ఎక్కువ మంది గ్రూప్‌-2కు దరఖాస్తు చేశారు. మొత్తం 8 లక్షలకు పైగా దరఖాస్తుల్లో హైదరాబాద్‌, రంగారెడ్డి జిల్లాల నుంచి వచ్చినవి లక్షా 23వేలే! కరీంనగర్‌, వరంగల్‌, నల్గొండ జిల్లాల నుంచి ఏకంగా 3.5లక్షల దరఖాస్తులు రావటం గమనార్హం. మహబూబ్‌నగర్‌ జిల్లా నుంచీ 80వేలు దాటాయి. "ప్రభుత్వమనేది పల్లెల్లో ప్రస్ఫుటంగా కన్పిస్తుంది. ప్రభుత్వ అధికారుల ప్రభావం, హోదా గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ప్రభావితం చేస్తుంది. అందుకే అక్కడ సర్కారు ఉద్యోగాలంటే అంత ఆసక్తి. హైదరాబాద్‌లాంటి నగర ప్రాంత అభ్యర్థులకు ప్రైవేటు ఉద్యోగాలూ అందుబాటులో ఉంటాయి. కానీ పల్లెల్లో తక్కువ. ప్రైవేటులో ప్రస్తుతం ఉద్యోగాలు సేవారంగంలోనే ఎక్కువున్నాయి. వాటికి అవసరమైన కమ్యూనికేషన్‌ నైపుణ్యాలు గ్రామీణ అభ్యర్థుల్లో తక్కువ. సహజంగానే వారికి ప్రభుత్వ ఉద్యోగాలు తప్పనిసరి ప్రత్యామ్నాయమవుతున్నాయి" అని బ్రెయిన్‌ట్రీ శిక్షణ సంస్థ డైరెక్టర్‌ గోపాలకృష్ణ విశ్లేషించారు.

## వారికి కొలువంటే సర్కారు నౌకరీనే!

ఎన్నో ఏళ్లుగా ఉద్యోగ నియామకాలు లేవు. టీఎస్‌పీఎస్సీ వచ్చాక కూడా సాంకేతిక పోస్టులకు పరీక్షలు జరిగాయే తప్ప... సాధారణ అర్హతలున్నవారికి నియామకాలు చేపట్టలేదు. అందుకే ఇంత పోటీ. పట్టణాల్లో ఉద్యోగమంటే ప్రభుత్వం, ప్రైవేటు ఏదైనా కావొచ్చు. కానీ గ్రామీణ ప్రాంతాల్లో కొలువంటే ప్రభుత్వ ఉద్యోగమే! అందుకే అవంటే మోజెక్కువ.

**–డీఈవోగా పనిచేస్తున్న ఓ అధికారి**

## గ్రామీణ అభ్యర్థుల మేలుకు టీవీ ద్వారా శిక్షణ..

జనాభా ఎక్కువుండే హైదరాబాద్‌, రంగారెడ్డి జిల్లాల నుంచి కంటే గ్రామీణ ప్రాంతాల నుంచి గ్రూప్‌-2కు దరఖాస్తులు ఎక్కువగా రావటం ఆసక్తికరం. దీన్ని ముందే గుర్తించి, గ్రామీణ అభ్యర్థులూ పోటీలో సమానంగా నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం టీవీ ద్వారా శిక్షణ ఏర్పాట్లు చేసింది. దీనివల్ల వారికి మేలు జరుగుతుంది.

**– ఆచార్య ఘంటా చక్రపాణి, టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్‌**